ఓమ్

ప్రబోధశతకము.

గ్రంథకర్త

ఆదిపూడిసోమనాథరావు

పిఠాపురం గోదావరిజిల్లా.

ఓమ్

ప్రబోధశతకము.

ఆదిపూడి సోమనాథరాయప్రణీతము.

మొదటికూర్పు 1000.

పిఠాపురమునందలి

శ్రీవిద్వజ్జనమనోరంజనీముద్రాక్షరశాల

నమ్ముద్రితము.

1915.

[వెల 0-1-0

తప్పొప్పుపట్టిక.

పేజి.	పద్యం.	తప్పు.	ఒప్పు.
4	18	కీయడె	కీయరె
15	74	నీనుండి	నిన్నుండి

ఓమ్

ప్రబోధశతకము.

శ్రీకరుండును దుర్జన ♦ భీకరుండు
శంకరుండును బాపనా ♦ శంకరుండు
రంజనుండును భక్తార్తి ♦ భంజనుండు
విశ్వపతి గాన నతని సే ♦ వింపు మనస. 1

గీ. నిల్వఁగా నేల, బాగుగాఁ ♦ బీల్వ గాలిఁ,
ద్రాగఁగా నీరుఁ, దినఁ బండ్లు, ♦ ధాన్యములను
గొల్లగాఁ బెట్టి జగమను ♦ నిల్లు గట్టె
హరికి మనమీఁద నెంతటి ♦ కరుణ మనస. 2

గీ. వింతవింతగ మెఱపుతో ♦ వీట వీటఁ
గోట్లకొలఁదిగ దీపముల్ ♦ గూర్ప నేమి
దివిని దేవుండు వెల్గించు ♦ దీపమైన
సూర్యునకు సాటివచ్చునే ♦ చూడు మనస. 3

గీ. ఆఁకలికి నేడ్వఁ బాలిచ్చి ♦ యలఁతఁ దీర్చు
నిదుర వచ్చిన జోకొట్టి ♦ నిదురపుచ్చు
మందగింపక వ్యాధికి ♦ మందు వోయు
అమ్మ పరమేశుదయకుఁ జి ♦ హ్నమ్ము మనస. 4

గీ. పెద్దలను భక్తితోడ సే ♦ వింపవలయు
సములతో మైత్రి నెప్పుడు ♦ సలుపవలయుఁ
బతితులను బ్రేమ నుద్ధరిం ♦ పంగవలయు
వసుధ హరికృపఁ గనఁగోరు ♦ వారు మనస. 5

గీ. లోపములనెల్లఁ దేటగాఁ ♦ జూపువాఁడు
మేలు నెప్పుడుఁ గోరుచు ♦ మెలఁగువాఁడు
ఇడుములను బాపఁ బ్రాణమే ♦ నిచ్చువాఁడు
మిత్రుఁ డనఁదగువాఁడు ధ ♦ రిత్రి మనస. 6

గీ. పూలు పాకింతయుఁ జెడకుండఁ ♦ బూలనుండి
తేనియను బీల్చుచుండెడు ♦ తేఁటికరణి
సౌఖ్య మింతయుఁ జెడకుండ ♦ జనులనుండి
పన్నుఁ గొనుటయె ప్రభునకుఁ ♦ బాడి మనస. 7

గీ. సదమలం బయి సుగుణాళి ♦ సదన మైన
స్వాంతమే కద భువిలోన ♦ స్వర్గ మనఁగ
మలినమయి దుర్గుణాళికి ♦ నిలయ మైన
చిత్తమే కద నరకంబు ♦ చెపుము మనస. 8

గీ. బలము విద్యయు సుగుణసం ♦ పదయుఁ గలిగి
ప్రాయమం దుండువారు వి ♦ వాహమైన
సంచితం బగుసంతాన ♦ మబ్బుఁ గాని
బాల్యమునఁ బెండ్లి యాడిన ♦ ఫలమె మనస. 9

గీ. నీతి లేకున్న జగతి వి • ఖ్యాతి లేదు
నీతి లేకున్న మదికి సం • ప్రీతి లేదు
నీతి లేకున్న నాత్మకు • జ్యోతి లేదు
ఏదియును నీతికిని సాటి • రాదు మనస. 10

గీ. తనకు నభిమానవిషయమౌ • దాని జనుఁడు
దిరముగాఁ గృషి చేసి సా • ధింపవలయు
నన్యవిషయము లెల్ల సా • మాన్యముగను
దెలిసి విద్యావినోది గా • వలయు మనస. 11

గీ. ఒకని మెప్పింప సాధ్యమై • యొప్పుఁ గాని
సర్వజనులను మెప్పింప • సాధ్య మౌన?
కానఁ దనయంతరాత్మయై • క్రాలుచుండు
నొక్కదేవుని మెప్పింప • నొప్పు మనస. 12

గీ. పగను బగ వోదు గావునఁ • బొగరు దక్కి
ధరణి నంతటఁ బ్రేమామృ • తమ్ముఁ బఱపి
పగను జల్లార్చివైచెడు • పావనుండె
పరమసంతోషధామంబుఁ • బడయు మనస. 13

గీ. ధర్మమును సుంతయైనను • దప్పకుండఁ
దగినమార్పులఁ గాలోచి • తముగఁ జేసి
కాలచక్రంబుతోఁ బాటు • కదలుజాతి
పరమసౌభాగ్యవంతమై • ప్రబలు మనస. 14

గీ. స్వర్గమునకంటెఁ దనదగు ♦ జన్మభూమి
నెంతయును గొప్పగా నెంచి ♦ సంతతంబు
దానివృద్ధికి నన్నివి ♦ ధాలచేతఁ
బూని పనిసేయు దేశాభి ♦ మాని మనస. 15

గీ. ప్రబలు లెప్పుడు భువిని దు ♦ ర్బలులఁ ద్రుంప
వేచి యుందురు గాన వి ♦ వేకమతులు
దైవమును నమ్మి యెంతయు ♦ ధైర్యమూని
యెల్లబలముల నార్జింప ♦ నెంత్రు మనస. 16

గీ. అవయవము లెల్ల నైకమ ♦ త్యమ్ముతోడ
దేహమును గాచుచుండెడు ♦ తెఱఁగు దోఁప
దేశభక్తులు దమతమ ♦ దేశములను
గాచుకొం డ్రైకమత్యంబు ♦ గలిగి మనస. 17

గీ. తమసుఖమ్మును దుఃఖమ్ము ♦ తనవి గాఁగ
నెంచి తమపయి సుఖమె వ ♦ ర్షించుచుండ
ప్రాణపదముగఁ దమ్మెఁ గా ♦ పాడునేని
ప్రభునకిత్తురె ప్రాణమే ♦ ప్రజలు మనస. 18

గీ. ఎప్పటికి నెవ్వి జనుల క ♦ భీప్సితములో
యప్పటికి వాని నిర్మించి ♦ యద్భుతముగ
నమ్మకము గొల్పి యోగ్యులా ♦ భమ్ముఁ గొనుచు
నమ్మి ధనవంతులాట న్యా ♦ యమ్ము మనస. 19

గీ. పరులు దనపట్ల నెట్టులు ♦ పరఁగఁ గోరు
బరులకట్టులఁ దానట్లు ♦ పరఁగుచుంట
ధరణిలోపల నుత్కృష్ట ♦ ధర్మ మంచుఁ
జాటి రార్యులు సర్వదే ♦ శముల మనస. 20

గీ. వివిధవిజ్ఞానశాస్త్రముల్ ♦ విశ్వవిభుని
నిరత మొకతీరుగా వెల్గు ♦ నియమములను
దెల్పి యాతనిమహిమ బో ♦ ధించుఁ గాన
వాని నందఱుఁ బఠియింప ♦ వలయు మనస. 21

గీ. తాను వసియింపఁ బ్రేమతో ♦ దైవ మిడిన
మందిరమ్మగుదేహమ్ము ♦ నందు నుండు
యంత్రములఁగూర్చి యెఱుఁగని ♦ యజ్ఞుఁ డెట్లు
కడుసుఖమ్ముగ వసియింపఁ ♦ గలఁడు మనస. 22

గీ. సృష్టిలోపలిచేతనా ♦ చేతనములు
పరుల కుపకార మొనరించి ♦ వఱలుచుండ
మానవుఁడు స్వార్థపరుఁ డయి ♦ మనియెనేని
వానిజన్మంబు భువిని ని ♦ ష్ఫలము మనస. 23

గీ. ఆకసంబున నెల్లబ్ర ♦ హ్మాండములను
నలుసులట్లుగఁ దేల్చి య ♦ నంతమహిమఁ
జూపు సర్వేశు మదిలోనఁ ♦ జూడఁ డేని
వాఁడె పో యంధుఁ డనఁదగు ♦ వాఁడు మనస. 24

గీ. చూచువా రెంతయును మదిఁ ♦ జోద్యమందఁ
జిత్తరువు వ్రాసి దానికి ♦ జీవ మిడఁగ
శక్తి లేమికి గర్వంబు ♦ సర్వ ముడిగి
దైవమును జిత్రకారుఁడు ♦ దలఁచు మనస. 25

గీ. వేనిచేతను దేశముల్ ♦ వృద్ధిఁ గనెనొ
వేనిచేత నశించెనో ♦ వాని నెల్ల
దేశచరితలలోఁ గాంచి ♦ దేశమునకు
వృద్ధి గూర్పఁ గడంగు సు ♦ బుద్ధి మనస. 26

గీ. పెరుఁగును మథింపఁ గలిగెడు ♦ వెన్నమాడ్కిఁ
బ్రకృతిని మథించుకొలఁదిఁ బ్ర ♦ పంచమునకు
మేలు సమకూర్చువస్తువుల్ ♦ వేలకొలఁదిఁ
గలుగుఁ దఱుఁగనిపరమేశు ♦ కరుణ మనస. 27

గీ. పువ్వులోపలఁ దేనె, ను ♦ వ్వులను నూనె,
యబ్ధిలో నుప్పు, దారువు ♦ లందు నిప్పు,
పెరుఁగులో వెన్న పెట్టిన ♦ కరణి నెన్న
నీశ్వరుఁడు దేహమునఁ బ్రాణ ♦ మిడెను మనస. 28

గీ. వినెడువారికి వీనుల ♦ విందుగాఁగఁ
బరమపురుషుని సుగుణప్ర ♦ భావములను
వివిధవృత్తాళిలోపల ♦ వినుతి సేసి
సుకవి సంతోషభరమునఁ ♦ జొక్కు మనస. 29

గీ. రాగతాళమ్ములను గూర్చి ♦ రమ్యఫణితిఁ
బాడ నేర్చినమాత్రాన ♦ ఫలము గలదె
దేవదేవునిదివ్యప్ర ♦ భావములను
జెన్నుమీఱఁగఁ గీర్తింప ♦ కున్న మనస. 30

గీ. ఒక్కవైపున సూర్యుని ♦ నొక్కవైపు
సురుచిరంబుగఁ జుక్కలఁ ♦ జూపుకొఱకు
రమ్యతరమైనభూమియర్క ♦ రాట్నమందుఁ
బెట్టి మముఁ ద్రిప్పఁగద విశ్వ ♦ విభుఁడు మనస. 31

గీ. పలు తెఱంగులఋతువులు ♦ గలిగి జనులు
వివిధసౌఖ్యమ్ములను గాంచి ♦ వెలయుకొఱకు
సకలజగదేకనాథుశా ♦ సనముచేతఁ
దరణిచుట్టును దిరుగును ♦ ధరణి మనస. 32

గీ. దుష్టులే లేకయుండిన ♦ శిష్టులకును
సుగుణసంపద యెల్లను ♦ జూపుటకును
సమయ మబ్బున కావున ♦ జగతియందుఁ
గ్రాలు నన్నిటఁ బరమేశు ♦ కరుణ మనస. 33

గీ. పాపికిదు భీతి, బాధకుఁ ♦ బార మ్మునఁగు
వచ్చువారికిఁ జోటిచ్చుఁ, ♦ బ్రీతిఁ జూపఁ
గ్రొత్తవారికి సమయంబుఁ ♦ గూర్చుఁ గాన
మరణమునఁగూడ హరికృప ♦ మెఱయు మనస. 34

గీ. పాటుపడఁ దిండి రుచ్యమై ♦ పరఁగుచుండుఁ
బాటుపడ హాయిగా నిద్ర ♦ పట్టుచుండుఁ
బాటుపడ దేహ మారోగ్య ♦ భాగ్య మందుఁ
బాటుపడువాఁడె సుఖములఁ ♦ బడయు మనస. 35

గీ. బడలికను దీర్ప, నొడలికి ♦ బలము గూర్పఁ,
బాటవముతోడ బుద్ధికిఁ ♦ దేటఁగొల్పఁ
జక్కఁగాఁ బనిసేయను ♦ త్సాహ మిడఁగ
నుచితమగునిద్ర పరమేశుఁ ♦ డొసఁగె మనస. 36

గీ. ప్రస్తుతం బున్నతిని గాంచఁ ♦ బాటుపడక
పూర్వులపరాక్రమాదులే ♦ పొగడికొనుచు
వ్యర్థముగఁ గాలమునుబుచ్చు ♦ వాని బుధులు
వట్టిమూర్ఖునిగా నెంత్రు ♦ వసుధ మనస. 37

గీ. స్త్రీలు పురుషులుగూడ నే ♦ దేశమందు
మోద మిడుదురో విద్యావి ♦ నోదు లగుచు
నద్ది సర్వేశుకరుణచే ♦ నలరుచుండి
దేశములకెల్లఁ దిలకమై ♦ తీరు మనస. 38

గీ. లోపములఁ జూపువారిపైఁ ♦ గోపపడక
వందన మొనర్చి తనకున్న ♦ కుందులెల్లఁ
బాపుకొనఁ బాటుపడుచుండు ♦ భవ్యమతియె
యఖిలసద్గుణవంతుఁడై ♦ యలరు మనస. 39

గీ. ఎట్టివాఁడైనఁ బరమేశు ♦ సృష్టిలోన
గర్వభ్వరమునఁ గన్నులు ♦ గానఁడేని
లోఁతు తెలియంగరానట్టి ♦ గోతిలోనఁ
దల్లక్రిందుగఁ బడును ద ♦ థ్యమ్ము మనస. 40

గీ. తన్ను నమ్మినవారల ♦ యున్నతికిని
దఱిని సాయమ్మొనర్పఁగఁ ♦ దప్పువాఁడు
కీడుమూడినయప్పుడు ♦ తోఁడుగనక
డిల్లపడి యెంతయును దల్ల ♦ డిల్లు మనస. 41

గీ. దిక్కుమాలినదీనులఁ ♦ బెక్కులైన
తంత్రములచేత నొక్కఁగాఁ ♦ దలఁచువాని
నొక్కసారిగ భగవంతుఁ ♦ డుక్కడంచు
దీనరక్షయె తనదీక్ష ♦ గాన మనస. 42

గీ. తీసి యీలేనిప్రాణముల్ ♦ దీసి తీసి
భావమం దుండుకరుణను ♦ బాపి పాపి
చేత వాతను బాపముల్ ♦ చేసి చేసి
బ్రదుకుమనుజుఁడు భూమికి ♦ బరువు మనస. 43

గీ. ఒరులయున్నతి వీక్షించి ♦ యుడుకువాఁడు
తనప్రతాపమ్ము కొనియాడు ♦ కొనెడువాఁడు
బాధపడువారిఁ గని దుఃఖ ♦ పడనివాఁడు
పరమపాతకుఁ డనఁదగు ♦ వాఁడు మనస. 44

గీ. శత్రువేషంబుఁ దాల్చిన • మిత్రుఁ డరయఁ
జేయలేఁడేని మేల్ కీడు • సేయకుండు
మిత్రవేషంబుతో నున్న • శత్రు వన్నఁ
గూర్మిఁ జూపుచునే గొంతుఁ • గోయు మనస. 45

గీ. దుర్జనులు సజ్జనులపలెఁ • దోఁచుచుండ్రు
తోఁచుచుందురు సుజనులు • దుష్టులట్టు
లున్నరీతిని నగపడ • కుంద్రుజనులు
గానఁ బైవేషముల నమ్మఁ • గాదు మనస. 46

గీ. పరులదోషముఁ గనఁ జాటు • పడుటకంటెఁ
దొడరి తనదోషమును జూడఁ • దొడఁగెనేని
మాని తనయల్పభావంబు • మానవుండు
పడయుచుండు నుదారభా • వంబు మనస. 47

గీ. జగములోపల నిష్ప్రయో • జనముగాఁగ
నేదియును హరి సృష్టింప • లేదు గానఁ
బనికిమాలిన దని దేనిఁ • బలుకకుండ
దానియుపయోగ మెఱుఁగంగఁ • దగును మనస. 48

గీ. వానకోయిల తమితోడ • వానచినుకు
కొఱకు వేచెడుగతిని స • ద్గుణముకొఱకు
వేచి యొచ్చట నది గన్న • విడువకుండ
నీదిగా నెంచి కైకొంట • నీతి మనస. 49

గీ. అప్పటికిఁ గష్ట మొదవిన ♦ నెప్పటికిని
సుఖమ్మె కలిగెడుపని సేయఁ ♦ జూడవలయు
నప్పటికి మేలు గల్గిన ♦ నెప్పటికిని
గష్ట మబ్బెడుపని సేయఁ ♦ గాదు మనస. 50

గీ. హానిలాభమ్ములనుబట్టి ♦ యరసి చూడఁ
గొందఱకు నష్ట మొదవినఁ ♦ గొంచెముగను
బలువురకుఁ జాల మేలును ♦ గలుగఁజేయు
పనులు సేయుచు నుంటయే ♦ పాడి మనస. 51

గీ. పాపపుణ్యంబులనుగూర్చి ♦ భవ్యమతులు
స్పష్టముగఁ దెల్పినట్టిల ♦ క్షణము వినుము
పరుల కపకార మొనరింపఁ ♦ బాప మగును
బరుల కుపకృతి పుణ్యమై ♦ పరఁగు మనస. 52

గీ. మంచిచెడుగులు రెండును ♦ మనుజునందుఁ
బెనగొనియె యుండు, మంచిని ♦ బెంపకున్నఁ
జెడుగు చెలరేఁగుఁ, జెడుగును ♦ జెడ నడంప
మంచి తలయెత్తి యెంతయు ♦ మించు మనస. 53

గీ. సుగుణమణిహారసూత్రమై ♦ నెగడుచుండు
మార్తుఱనుగూడ సఖులుగా ♦ మార్చుచుండు
గుప్తముగఁ గీర్తి నల్గడఁ ♦ గూర్చుచుండు
నడఁకువయె యెల్లవారికిఁ ♦ దొడవు మనస. 54

గీ. పరుల కుపకార మొనరింపఁ ♦ బాటుపడెడు
పుణ్యమూర్తికి హృదయాన ♦ బాదలుశాంతి
ఘోరతరములు గష్టముల్ ♦ గోట్లకొలఁది
వచ్చినను నోర్చుకొనుశక్తి ♦ నిచ్చు మనస. 55

గీ. తమసుఖమె చూచుకొనుచుండు ♦ దంపతులకు
నీశ్వరుఁడు ప్రేమసంతాన ♦ మిడుట చూడఁ
బరులకై స్వార్థమును వీడి ♦ పాటుపడఁగ
నెమ్మినొసఁగెడుప్రథమపా ♦ ఠమ్ము మనస. 56

గీ. తనబలమ్మును విద్యయుఁ ♦ దనధనమ్ము
దేవదత్తము లని మదిఁ ♦ దెలిసి వాని
సతతము పరోపకృతి నిడు ♦ సదయుమీఁద
హరి సుఖామృతవృష్టిని ♦ గురియు మనస. 57

గీ. విత్తనము నష్టమైనను ♦ వృక్షరూప
మొంది వర్ధిల్లుచుండెడు ♦ చందమునను
గాయ మెడలినసుజనుండు ♦ ఖ్యాతిరూప
కాయమును బొంది వర్ధిల్లుఁ ♦ గాదె మనస. 58

గీ. వివిధభాషలయందుండు ♦ విషయములను
లలితమౌశైలితోడ స ♦ లక్షణముగ
మాతృభాషను భాషాభి ♦ మాని వ్రాసి
యక్షయంబగుకీర్తి చే ♦ నలరు మనస. 59

గీ. సూదిబెజ్జంబులోపల ♦ సూటిగాను
సామజంబైన దూరంగఁ ♦ జాలుఁ గాని
మోక్షరాజ్యమహాద్వార ♦ మును జొరంగ
లేఁడు విషయాబ్ధి మునిఁగిన ♦ వాఁడు మనస. 60

గీ. యుద్ధమున వేలకోలఁదిగ ♦ యోధవరులఁ
గూల్చువీరునికంటెను ♦ ఘోరపాప
జాలములతోడఁ బోరాడి ♦ జయముగాంచు
వీరుఁడే యుర్వి శ్రేష్ఠుఁడై ♦ వెలయు మనస. 61

గీ. అఖిలపాపములకు మూల ♦ మగుచు నడరు
నింద్రియాళిని నెదిరి జ ♦ యించి వాని
సత్పథంబున నడిపింపఁ ♦ జాలఁడేని
నెన్నిరాజ్యమ్ము లేలిన ♦ నేమి మనస. 62

గీ. పాపమునుగూడ మర్యాదఁ ♦ బడయుటకును
బుణ్యవేషంబుఁ దాల్చెదు ♦ పోల్కి చూడఁ
బూని పాపంబుగూడ న ♦ ప్పుణ్యమునకు
గౌరవముఁ జూపుచుండుట ♦ గాదె మనస. 63

గీ. సత్యమనుధ్రువరేఖపై ♦ సంతతంబు
దిరుగుచును నిల్చి హరియందుఁ ♦ దిరముగాను
సత్పథమ్మున నరుగుప్ర ♦ శస్తమతియె
భూతలస్వర్గలోకమై ♦ పొల్చు మనస. 64

గీ. పొగడుఁగాక జనావళి ♦ దెగడుఁగాక
పెంత్రుగాక నృపాలురు ♦ నొంత్రుగాక
చేరుఁగాక సుఖమ్ములు ♦ జాఱుఁగాక
సత్పథమునుండి తొలగంగఁ ♦ జనదు మనస. 65

గీ. సత్యమైయొప్పున్యాయప ♦ క్షంబుఁ బూని
సములపైఁగాని తమకంటె ♦ శక్తియందు
నధికులౌవారిపైఁగాని ♦ యడరి తొడరి
గెలుపుగొనుటయె శౌర్యమై ♦ వెలయు మనస. 66

గీ. దీనులై తమకెవ్వరు ♦ దిక్కులేక
పొక్కువారలపైఁ బొగ ♦ రెక్కి యురిగి
పెక్కుబాధలఁ జిక్కించు ♦ ఫక్కిచూడఁ
గ్రౌర్యమే కాని శౌర్యంబు ♦ గాదు మనస. 67

గీ. మహిని దప్పొనరించుట ♦ మనుజగుణము
తప్పు క్షమియించు టెంతయు ♦ దైవగుణము
గానఁ జేసినతప్పుకై ♦ కరము వగుచు
దీను క్షమియింప హరి మెచ్చు ♦ తీరు మనస. 68

గీ చూపవలయును మిత్రుని ♦ లోపములను
జూడవలయును శత్రుని ♦ సుగుణములను
జూచికొని తనలోపలఁ ♦ జొచ్చియున్న
పాపములనెల్లఁ బాపుకో ♦ వలయు మనస. 69

గీ. తమచరిత్రల నుత్తమో ♦ త్తమములుగను
జేసికొనఁగోరువారల ♦ చిత్తములకు
నెదుట నాదర్శకము లయి ♦ పొదలుచుండు
ధరమహాత్ములసచ్చరి ♦ త్రములు మనస. 70

గీ. బలము నార్జింప సుగుణసం ♦ పద గడింప
భక్తి మదిఁ బెంపఁ బరమపా ♦ వను భజింప
గురుల సేవింప విద్యల ♦ నెఱిఁ బఠింప
బ్రహ్మచర్యంబు వహియింప ♦ వలయు మనస. 71

గీ. అందఱానందమునఁ దేలి ♦ యాడుచుండ
నేడ్చుచును వత్తు మిబ్భువి ♦ కెల్లరమును
వగవ మనకందఱానంద ♦ ముగను మనము
పోవునట్లుగ మెలగంగఁ ♦ బోలు మనస. 72

గీ. వచ్చి గర్వంబు దనలోనఁ ♦ జొచ్చెనేని
హరికిఁ దనకును నుండెడు ♦ నంతరంబు
మనుజుఁడు దలంప నెండకు ♦ మంచువోలెఁ
గరఁగిపోవును గర్వ మా ♦ క్షణమె మనస. 73

గీ. పాపరోగంబు నీనుండి ♦ పాయుటకును
వేకువను సంజ నిత్యంబు ♦ విడువకుండ
హరిగుణధ్యాన మనుపర ♦ మౌషధంబు
భక్తియుతముగ సేవింప ♦ వలయు మనస. 74

గీ. హృదయసింహాసనంబున ♦ నీశు నునిచి
సకలజీవులకును దన ♦ శక్తికొలఁదిఁ
గూర్మితో సాయమొనరించు ♦ కొలు వొనర్చి
మనెడుకరుణాళువే భక్తుఁ ♦ డనఁగ మనస. 75

గీ. భక్తు లని వేషములు వేయ ♦ వచ్చుఁగాని
నిర్మలం బగుమదితోడ ♦ ధర్మ మెఱిఁగి
పరమపురుషునియాజ్ఞలో ♦ పల మెలంగి
ధన్యతము లౌట మిగులదు ♦ స్థిరము మనస. 76

గీ. చాటుచాటుగఁ బాపముల్ ♦ చాల సలిపి
యంద ఱెఱుఁగ నొకింతపు ♦ ణ్యంబు చేసి
జనుల వంచింప నగుఁ గాని ♦ సర్వమెఱుఁగు
దైవమును మోసపుచ్చంగఁ ♦ దరమె? మనస. 77

గీ. పాపములకయి లోనఁ జీ ♦ వాట్లు పెట్టి
యంద ఱెఱిఁగెడునట్లు పు ♦ ణ్యంబులకును
దగినయాదరమును గూర్చి ♦ దయను జూపు
జగదధీశున కెవ్వరు ♦ సాటి? మనస. 78

గీ. మిత్రుఁడుగఁ గొందఱకు నుండు ♦ శత్రువుగను
గొందఱకు నుండుఁ దక్కిన ♦ యందఱకును
మహిఁ దటస్థుఁడుగా నుండు ♦ మానవుండు
అందఱకు మిత్రుఁడగువాఁడు ♦ హరియె మనస. 79

గీ. నిప్పు గాల్పంగ లేనట్టి ♦ నీరమైనఁ
గడిగివేయంగ లేనట్టి ♦ గాలియైనఁ
పారఁదోలంగ లేనట్టి ♦ పాపములను
నిముసమునఁ బాపు హరిఁ జేరి ♦ నెగడు మనస. 80

గీ. అంతరాంతరహృదయగు ♦ హాంతరమునఁ
గదలి మెదలక తిరముగాఁ ♦ బొదలుమాని
తేటతెల్లంబుగాఁ జూపు ♦ తెన్నువట్టి
మోక్షసామ్రాజ్యమును జేరఁ ♦ బొమ్ము మనస. 81

గీ. విన్నఁ బరమేశుమాటలే ♦ వింటివేని
గన్నఁ బరమేశుతత్త్వమే ♦ కంటివేని
మన్నఁ బరమేశుసేవనే ♦ మంటివేని
సున్నయై పోవు పాపముల్ ♦ లన్ని మనస. 82

గీ. పాడుచుండుము హరికీర్తి ♦ భక్తితోడఁ
గూడుచుండుము భక్తులఁ ♦ గూర్మితోడ
వీడుచుండుము దుష్టుల ♦ వెరవుతోడ
హరి ముదంబున నీతోడ ♦ నాడ మనస. 83

గీ. గుట్టు సఖులకుఁ జెప్పినఁ ♦ గూర్మి మఱచి
వెల్లడింతురు లోలోన ♦ నెల్లరకును
ఎన్ని చెప్పిన విని హరి ♦ యించుకైన
నెవరికిని జెప్పఁ డంతటి ♦ హితుఁడు మనస. 84

గీ. ఇచ్చటికి నిన్ను దేవుఁడు ♦ దెచ్చినప్పు
డెన్నిసదుపాయములఁ గూర్చె ♦ నెఱుఁగుదు గద
యెచటకుం గొనిపోయిన ♦ నచటఁగూడ
నిట్లె కృపచేయు నని నమ్మ ♦ వేల? మనస. 85

గీ. గర్భమందున్నయప్పుడు ♦ గాచినాఁడు
గాఢమౌనిద్రయందును ♦ గాచినాఁడు
గావఁడుందునె మరణంబు ♦ గాంచినపుడు
చేర్చి తనయొడి హరి నిన్నుఁ ♦ దేర్చుమనస. 86

గీ. జననికడనుండి వచ్చి యా ♦ జననిదరికి
నరుగఁ జింతిల్లునినుఁ జూడ ♦ నలుక వొడముఁ
బుట్టినింటికి నందఱు ♦ ముదముతోడఁ
బోవ నీకిది యేమిదు ♦ ర్బుద్ధి మనస. 87

గీ. పట్టియున్నట్టిమైలను ♦ బాపుటకును
బట్టలను బండపైఁ బెట్టి ♦ బాదునట్లు
పీడిపోవంగఁ బాపముల్ ♦ వెతను బెట్టి
దేవుఁ డుతుకును నిన్నుభీ ♦ తిలకు మనస. 88

గీ. ఎవ్వ డెచ్చటఁ గోరిన ♦ నవ్వ డచట
దర్శనం బిచ్చి నినుఁగాచు ♦ దాత యైన
దైవ ముండంగ నల్పుల ♦ దరిని జేరి
వ్యథగ యాచించుచుందువు ♦ వేల? మనస. 89

గీ. కూర్మి నీమీఁద శుభములే • కురియుచుండు
దేవుఁ డొసఁగినదానితోఁ • దృప్తిఁ గనక
యేల యడిగెద విది యది • యిమ్మటంచు
నెఱుఁగఁడే హరి నీకెద్ది • హితమొ? మనస. 90

గీ. ఒండొకటితోడ డీకొన • కుండుమాడ్కి
నద్భుతమ్ముగ దివిని బ్ర • హ్మాండములను
వివిధరీతులఁ ద్రిప్పెడు • విశ్వవిభుని
చేతిలీలారవిందమై • చెలఁగు మనస. 91

గీ. రమ్యకల్యాణగుణమణి • రచితభక్త
హృదయసింహాసనంబునఁ • బాదలుచుండి
సకలజగముల నేలెడు • సార్వభౌము
కూర్మిబిడ్డవు నీకేమి • కొదువ? మనస. 92

గీ. అర్కశతకోటిచంద్రస • హస్రకోటి
కలితలలితమహాద్భుత • కాంతియుక్త
చారుసౌందర్యమూర్తియౌ • స్వామియెదుట
నిల్వుటద్దముగా నిల్చి • నెగడు మనస. 93

గీ. ధర్మవైరులఁ జెండాడ • దైవ మెంచి
వారిపై నినుఁ గొల్పిన • వార్యధైర్య
శౌర్యములఁ జూపి పోరాడి • జయము గాంచి
దివ్యభృత్యుఁడ వనుకీర్తిఁ • దెమ్ము మనస. 94

గీ. నమ్మి నీకంతయు నొసంగు ♦ నమ్మకమ్ము
స్వామికిని గల్గునట్లుగా ♦ సంచరించి
పరమమైత్రిని నాతని ♦ పజ్జఁజేరి
యార్తులకు నెల్ల నాప్తుండ ♦ వగుము మనస. 95

గీ. నేను వరియింప నెవరిని ♦ నిన్నెకాని
యంచు నన్నియు విడనాడి ♦ హరిని నీవు
వలచితివి గాన నతఁడును ♦ వలచె నిన్నుఁ
గూర్మి నొకటైతి రింకేమి ♦ కొఱఁత? మనస. 96

గీ. ఏకతంబున లోనఁ బ్రా ♦ ణేశుఁడైన
పరమపురుషునితోఁ గూడి ♦ పాడి యాడి
నిరుపమానందభరమునఁ ♦ గరము చొక్కి
మఱచిపొమ్మెల్ల నిను నీవు ♦ మఱచి మనస. 97

గీ. ఎంతకూరిమి నొక్కటై ♦ యెసఁగుచున్న
ప్రభువు వరియించె నని గర్వ ♦ పడితివేని
పడినపాటెల్ల వ్యర్థమై ♦ ప్రథమదశకు
నిన్ను నగ్గర్వమే తెచ్చు ♦ నిజము మనస. 98

గీ. స్వచ్ఛమైనట్టిభక్తితో ♦ స్వామిసేవ
నఖిలవిధములచేత నీ ♦ వాచరించి
మరలి రాకుండ మోక్షసా ♦ మ్రాజ్య మందె
యలరుచుందువు నాప్రియ ♦ మైనమనస. 99

గీ. అంద ఱాప్రిభుసంతాన • మగుటఁ దెలిసి
గాఢసోదరభావంబు • గలిగి మెలఁగి
భూతలం బెల్ల స్వర్గమై • పొదలునట్లు
సలుప వేఁడుము సర్వేశు • సతము మనస. 100

గీ. శతక మిది వ్రాయఁగోల్పిన • హితుని సుగుణ
రతుని నాయనివేంకట • రంగనృపునిఁ
దత్సతిని సంతతిని మహో • దారమతిని
బెంపఁ బరమేశు భక్తిఁ బ్రా • ర్థింపు మనస. 101

V. M. R. Press